కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


వనస్థలిపురంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులతో మధుయాష్కీ గౌడ్, రినీష్‌రెడ్డి

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డికి మద్దతుగా చేపట్టాల్సిన ప్రచారంపై బుధవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 10 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో వనస్థలిపురం పార్టీ కార్యాలయంలో సునీత మహేందర్‌రెడ్డి కుమారుడు రినీష్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 16న ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తారని, అందుకు తగ్గట్టుగా తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల అధ్యక్షుడు మకుటం సదాశివుడు, లింగాల కిషోర్ గౌడ్, కట్ల నర్సింహ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, గజ్జి శ్రీనివాస్ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సత్యనారాయణ, మంజులారెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దీపక్ జాన్

మలక్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం ఆధ్వర్యంలో బుధవారం మూసారంబాగ్ షాలోమ్ టెంపుల్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేషన్ ద్వారా క్రైస్తవులకు అందిస్తున్న పథకాలపై పాస్టర్లకు, చర్చి పెద్దలు, క్రైస్తవ నాయకులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు ఏ విధంగా పొందాలో వివరించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాస్టర్లు, పెద్దలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. షాలోమ్ టెంపుల్ చైర్మన్ డాక్టర్ పి. సాల్మన్‌జోబ్స్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నిజామాబాద్ వీపీఎం చర్చి పాస్టర్ రెవరెండ్ జెకరియా ఆనంద్ ప్రసంగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైస్ ప్రెసిడెంట్ సంతు, ప్రధాన కార్యదర్శి అనిత షిబారాణి, కోశాధికారి శ్రీధర్‌రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నవీన్, జయరాజ్, సామేల్, యేసురత్నం, క్రిస్టోఫర్, యిర్మియా, జెకరియా, తదితరులు పాల్గొన్నారు.

‘మల్కాజిగిరి’ అభివృద్ధికి కృషి చేస్తా

స్వతంత్ర ఎంపీ అభ్యర్థి వైష్ణవి ప్రసాద్


మారుతినగర్‌లో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైష్ణవి ప్రసాద్

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర ఎంపీ అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవి ప్రసాద్) అన్నారు. కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని భాగ్యనగర్ బ్రాహ్మణ సమాజ భవనంలో మల్కాజిగిరి ఎన్నికల ప్రధాన కార్యాలయాన్ని బుధవారం సర్వ మతాల వారిచే ప్రారంభించారు. అనంతరం వైష్ణవి ప్రసాద్ మాట్లాడుతూ, మల్కాజిగిరి ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఇంటి సంక్షేమం, ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నిరంతరం ప్రజలకు సేవా చేసే వైష్ణవి ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. వారణాసి వంశీ, దుద్దు సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, మునిపల్లె శ్రీనివాస్, మంగపతిరావు, వక్కలంక శ్రీనివాస్‌రావు, దర్భసం శర్మ, ఆలూరి, గొల్లపూడి రాజేశ్వరరావు, మంగు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అమలుకాని హామీలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి
- లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు అమలుకాని హామీలిచ్చి వాటిని నెరవేర్చడంలో జాప్యం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల బీఆర్‌ఎస్ సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సత్తు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు బాస్‌లు ఢిల్లీలో ఉంటే బీఆర్‌ఎస్‌కు ఓటర్లే బాస్‌లు అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీందర్, నర్సింహ, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా శ్రమించాలి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కందుకూరు: మండలంలోని ధన్నారం, బాచుపల్లి, బేగరికంచె, వావిళ్లకుంటతండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సమక్షంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హస్తంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి పని చేయాలని కోరారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చొరవ తీసుకుంటానన్నా రు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇ చ్చారు. పార్టీలో చేరిన ధన్నారం మాజీ ఉప సర్పంచ్ మంద నర్సింహ, బీఆర్‌ఎస్ మాజీ ఎస్టీసెల్ అధ్యక్షుడు జరుపుల రూప్లానాయక్, నాయకులు పర్వతాలుయాదవ్, శ్రీకాంత్, నగేశ్, రాజప్ప, జె.రాజు, గణేశ్, రమేశ్, గోపి, కిరణ్ తదితరులకు కేఎల్లార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాతనరసింహారెడ్డి, పీసీసీ సెక్రటరీ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు విడుదల చేయండి

ఎంపీడీఓకు వ్యకాస నేతల వినతి


ఎంపీడీఓతో మాట్లాడుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య కోరారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మకు ఈమేరకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కూలీలకు పేస్లిప్పులు క్రమం తప్పకుండా ప్రతివారం ఇవ్వాలన్నారు. పర్మినెంట్ గ్రూపులు ఏర్పాటు చేయడంతో పాటు ఉదయం పూట పనులు చేయించాలని కోరారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో గాయాల పాలైన కూలీలకు మెడికల్ బిల్లులు ఇవ్వాలని, పని ప్రదేశంలో చిన్న పిల్లలను చూసుకోవడానికి ఆయాలను పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గణేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


గడ్డిఅన్నారం ప్రభుత్వ పాఠశాల వద్ద పాడైన రోడ్డు

అధ్వాన అంతర్గత రోడ్లతో అవస్థలు

- పైప్‌లైన్ల కోసం రోడ్ల తవ్వకం
- మట్టి కుప్పలు, గుంతలతో రాకపోకలకు జనం ఇక్కట్లు
- మరమ్మతులు పట్టని అధికారులు


వెంకటాద్రి గల్లీకి వెళ్లే దారిలో..


పాఠశాల ఎదురుగా తెరిచి ఉన్న మ్యాన్‌హోల్

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారంలో అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పైప్‌లైన్ల కోసం తవ్విన సీసీ, బీటీ రోడ్లు మట్టి కుప్పలు, గుంతలతో నరకానికి నకళ్లుగా మారాయి. రోడ్ల మరమ్మతులకు నోచుకోక వాహనదారులు, పాదచారులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకల ధాటికి రోడ్లు మరింతగా ధ్వంసమయ్యాయి. స్థానిక పాత శివాలయం నుంచి ప్రభుత్వ పాఠశాల, బస్తీ దవాఖానా మీదుగా దిల్‌సుఖ్‌నగర్ వెంకటాద్రి గల్లీ వైపు వెళ్లే రోడ్ల దుస్థితి ఇదీ. అసలే ఇరుకైన దారులతో ఇబ్బందులు.. దానికి తోడు రోడ్లు తవ్వి వదిలేయడంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాలలో విద్య, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండటం వలన నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాడైపోయిన రోడ్ల మూలంగా రాకపోకలకు ప్రజలు తిప్పలు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు బాగు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నోరు తెరిచిన మ్యాన్‌హోళ్లు..

గడ్డిఅన్నారంలో పాడైన రోడ్లు, నోరు తెరిచిన మ్యాన్‌హోళ్లతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాటర్ వర్క్స్ మ్యాన్‌హోళ్ల నాణ్యత కొరవడటంతో నిర్మించిన కొద్ది రోజులకే పాడైపోయి మురుగు రోడ్లపై పారుతోంది. జీహెచ్‌ఎంసీ మ్యాన్‌హోళ్లు కూడా ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాల ఎదురుగా మ్యాన్‌హోల్ మూత తెరిచి ఉంది. పిల్లలు ఆదమరిస్తే జరిగే నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని బస్తీవాసులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా సమస్యలకు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి



పాడైన రోడ్లు, మ్యాన్‌హోళ్లు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. అనంపూర్తి పనుల వలన సమస్యలు తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టి.. రోడ్ల సరిగా పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకుని రోడ్లను బాగు చేయాలని కోరుతున్నా.

– జి.శ్యామ్‌రావు, గడ్డిఅన్నారం బస్తీ

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 19, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 35, క్యాబేజీ 20, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 23, దొండ 19–23, చిక్కుడు 50, గోకర 23, బీట్‌రూట్ 21, క్యాప్సికం 70, ఆలు 31, దోస 17, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పండుగలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

చాదర్‌ఘాట్: ప్రజలు ప్రశాంత వాతావరణంలో రంజాన్, శ్రీరామనవమి పర్వదినాలు జరుపుకోవాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు కోరారు. బుధవారం స్టేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ, వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శ్రీరామనవమి శోభాయాత్రపై నిర్వాహకులతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ కూడా అమలులో ఉన్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నామని సీఐ తెలిపారు.

హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్

తుక్కుగూడ: రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు చింతల సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న వారికి ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉన్నారు.

రంజిత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



హుడాకాంప్లెక్స్: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన ఆ పార్టీ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలిపారు. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల నుంచి భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేస్తామని వారు ప్రకటించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


అన్నదానంలో పాల్గొన్న శ్రీశైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామీజీ

దిల్‌సుఖ్‌నగర్: శ్రీ శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నం–4లోని శ్రీ శైవ క్షేత్ర పీఠంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ వేడుకలకు శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై పంచలింగాలకు అభిషేకం నిర్వహించి, అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత విజయ్ కుమార్, శ్రీనివాస్, కిరణ్ కుమార్, శ్రీశైవ క్షేత్ర వనిత శక్తి ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిత హేమ, ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవ పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చంచల్‌గూడ: శ్రీరామనవమి సందర్భంగా కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ రామాలయంలో ఈ నెల 17 నుంచి మే 2వ తేదీ వరకు సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకుడు నిరంజన్ యాదవ్ తెలిపారు. రామాలయంలో బుధవారం ఉత్సవాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులు హాజరవుతారని చెప్పారు. ఉత్సవాల్లో రోజువారీగా హనుమ ధ్వజారోహణం, మాతాజాగరణ్, అశ్వ వాహన సేవ, గరుడవాహన సేవ, ఆంజనేస్వామి సేవ, శ్రీవారి ఊరేగింపు, సీతారాముల హనుమత్ వాహన సేవా ఊరేగింపు, మహాయజ్ఞం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్‌యాదవ్, గోపి, యాట ప్రమోద్, నవీన్, రాజ్‌పాల్‌యాదవ్, రాహుల్‌కిషోర్ యాదవ్ తదితరులున్నారు.

బాల్‌రెడ్డి సేవలు పేదల మదిలో పదిలం


సామ బాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సామ రమణారెడ్డి

సామ రమణారెడ్డి

చంపాపేట: చంపాపేట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మూడు దశాబ్దాల పాటు నిబద్ధతతో విధులు నిర్వర్తించిన దివంగత సామ బాల్‌రెడ్డి సేవలు పేదల మదిలో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామ రమణారెడ్డి అన్నారు. బుధవారం బాల్‌రెడ్డి 23వ వర్ధంతి సందర్భంగా చంపాపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై నాయకులు సామ నర్సింహారెడ్డితో కలిసి బాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ...బాల్‌రెడ్డి సర్పంచ్‌గా విధులు నిర్వర్తించే కాలంలోనే తన మిగులు భూమిని పేదల ఇళ్ల కోసం పంచి పెట్టారన్నారు. ఆయా ప్రాంతాల్లో రోషన్‌దౌలా, నేతాజీ నగర్, ముస్లిం బస్తీ, సుల్తానా అల్వా, కటకోనికుంట వంటి కాలనీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కూడా కల్పించిన ఘనత ఆయనకే దక్కిందని గుర్తు చేశారు. సామ బాల్‌రెడ్డి ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. అనంతరం చంపాపేట చౌరస్తాలో బాల్‌రెడ్డి కుమారుడు సామ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఐదు వందల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సామ గౌతమ్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కట్టా వెంకటేష్, మంత్రి జగన్, రఘునందన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, సారయ్య, శంకర్, గోవర్ధన్‌రెడ్డి, నేతాజీ యువజన సంఘ అధ్యక్షుడు బైగళ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు సర్వం సిద్ధం

నేడు ఈద్–ఉల్–ఫితర్

- సామూహిక ప్రార్థనలకు ఈద్గాలు, మసీదుల వద్ద ఏర్పాట్లు


రంజాన్ కోసం ముస్తాబైన సరూర్‌నగర్‌లోని మసీదు

దిల్‌సుఖ్‌నగర్: ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ కోసం సర్వం సిద్ధమైంది. ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోనున్నారు. పండుగ నేపథ్యంలో మలక్‌పేటజోన్ పరిధిలోని ఈద్గాలు, మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


సామూహిక ప్రార్థనలకు మాదన్నపేట ఈద్గా వద్ద ఏర్పాట్లు

- ప్రత్యేక ప్రార్థనల కోసం నిర్వాహకులు మాదన్నపేట ఈద్గా, సరూర్‌నగర్ ఈద్గా , దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, సైదాబాద్, కుర్మగూడ, అక్బర్‌బాగ్, అజంపుర, ఓల్డ్‌మలక్‌పేట తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. నెలవంక దర్శనంతో భక్తులు ఉపవాసదీక్షలను విరమించారు. రంజాన్ పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.
- రంజాన్ పర్వదినం సందర్భంగా షేర్వానీలు, అత్తర్లు, చెప్పులు, టోపీలు, మహిళలకు చీరల కొనుగోలు కోసం దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట మలక్‌పేట తదితర ప్రాంతాల్లోని షాపింగ్ మాల్స్, వస్త్రదుకాణాలు బుధవారం కిటకిటలాడాయి.
- రంజాన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సరూర్‌నగర్, చైతన్యపురి, మలక్‌పేట, సైదాబాద్, చాదర్‌ఘాట్, మీర్‌పేట, మాదన్నపేట పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి మసీదు, ఈద్గా వద్ద పోలీసులు ప్రత్యేక పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు.

‘నాగార్జున’లో ఘనంగా కాన్వొకేషన్ డే



నాగార్జున స్కూల్ కాన్వొకేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, విద్యాసంస్థ చైర్మన్ విఠల్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని నాగార్జున మాంటిస్సోరీ, ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో బుధవారం మాంటిస్సోరీ విద్యార్థులకు కాన్వొకేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నల్లగౌనులతో ఆకట్టుకున్నారు. వారి సాంస్కృతిక ప్రదర్శలు అలరించాయి. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ, చిన్నారులకు పాఠశాల పట్ల మక్కువ పెంచడానికి తమ పాఠశాలలో ప్లే వే పద్ధతిలో బోధిస్తున్నామన్నారు. ఇండోర్, ఔట్ డోర్ ప్లే గ్రౌండ్లతోపాటు స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుచేసి చిన్నారులకు మానసిక వికాసంతో పాటు శారీరక వికాసానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ వైస్ చైర్‌పర్సన్ జి.రజని విఠల్‌రెడ్డి, సీఏఓ శేషారావు, అకడమిక్ డీన్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ



మలక్‌పేట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ చేకోలేకర్ శ్రీనివాస్ బుధవారం మలక్‌పేట నుంచి కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు అందరూ కలిసి కృషి చేయాలని సీఎం సూచించారని శ్రీనివాస్ తెలిపారు. పార్టీ కోసం పని చేసే వారికి సముచిత స్థానం ఉంటుందని చెప్పారన్నారు. సీఎం ఆదేశాలను పాటిస్తూ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రత్యంగిరా ఆలయంలో పంచాంగ శ్రవణం



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో ఉగాది సందర్భంగా మంగళవారం రాత్రి ప్రముఖ జ్యోతిష్య పండితుడు డాక్టర్ శంకరమంచి రామకృష్ణ శాస్త్రిచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణ లత దంపతులు రామకృష్ణ శాస్త్రికి జ్ఞాపిక బహూకరించారు. విటల్ శర్మ, హేమంత్ శర్మ, అరుణ, హేమ, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రీన్ టెర్రస్ అపార్ట్‌మెంట్‌లో..

నాగోలు: నాగోలు డివిజన్ బండ్లగూడలోని మహానగర్ హోమ్స్, గ్రీన్ టెర్రస్ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం రాత్రి ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్యుడు రామ్మోహన్ వర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం గ్రీన్ టెర్రస్ నిర్వాహకులు ఆయనకు ఉగాది అవార్డును అందజేసి సన్మానించారు.

